# స్వతంత్ర భారతం!

'పత్రిక'కోసం ఏదన్నా రాయాలని తాపత్రయం!

ఎందుకోగాని పత్రికా ప్రపంచానికి జీవితాన్ని అంకితంచేసి, దాంట్లో వాళ్ళ జీవితాని కర్థం గ్రహించాలని తాపత్రయపడే జర్నలిస్టుల పత్రికలంటే అమితమైన గౌరవం నాకు! అందుకే 'పత్రి'కకి ఏదన్నా రాయాలని తాపత్రయం! (కాని సాధారణంగా ఆ పత్రికలు కూడా తక్కిన వ్యాపారస్థుల పత్రికల్లానే ఆశాభంగం కలిగిస్తూంటాయి-తరుచు).

కాఫీతో గాని హుషారు రాదని బజారుకు బయల్దేరాను.

ఆదివారమన్నట్టు మరిచిపోయి 'నెహ్రూ' కేఫ్‌లో కాలుపెట్టి వెనక్కి తిరిగాను. 'ఆంధ్రరత్న' భవనంగాని, 'ఆంధ్రకేసరీ' విలాస్‌గాని చాలా దూరమవడంవల్ల, దగ్గరగా ఉన్న 'జిన్నా' టీ స్టాలులో దూరి టీ సేవిస్తున్నాను.

అంతవరకూ నా పక్కనే కూచున్నప్పటికీ, నాచేత గుర్తింపబడకపోడానికి విచారిస్తూ, నిట్టూరుస్తున్న 'జైహింద్' టాకీసు యజమాని నాదృష్టి నాకర్షించాడు.

"కొత్తగా మీరు తెప్పించిన ఫిల్ము పేరేమిటి?"

"వందేమాతరం" అండీ!

అల్లాగే ఏదో సంభాషణ కానిచ్చి బయటపడ్డాను. అక్కడే వున్న 'గాంధీ' కిళ్లీషాప్ కనిపిస్తే అటు వెళ్లాను.

"ఒక కిళ్లీ యియ్యవోయ్!" అన్నాను.

"అరే! ఇప్పుడే తమలపాకులైపోయాయండీ" అని 'పోనీలే' అని వెళ్లిపోదామనుకొని వెనుతిరిగిన నాకాలు ఒక్కడుగన్నా ముందుకు పడకుండా ఇల్లా ఏకరువు పెట్టసాగాడు. "కిళ్లీ లేదుగాని, 'నేతాజీ' బీడీలు, 'నేషనల్' గోల్డుఫ్లేక్ సిగరెట్టులూ, 'జయప్రకాష్' చెక్కపొడీ, 'షణ్ముఖం చెట్టి' ముక్కుపొడీ - ఇంకేవి కావాల్సినా ఉన్నాయండి" అన్నాడు.

వాడి గొంతుక నొప్పన్నా పెట్టనందుకు సంతోషిస్తూ, ఒక చెక్కపొడి పొట్లం తీసుకుని ఇంటిముఖం పట్టాను.

కాంగ్రెసులో చేసిన త్యాగాలవల్ల ఇంకేమీ లాభంలేకపోగా, నిరాశచెంది, ప్రకాశంగారి ప్రధానిత్వపు రోజుల్లో ఒక ఖద్దరు బట్టలషాపు తెరిచి 'ప్రకాశం ఖద్దరుస్టోర్సు' అని పేరుపెట్టిన నా స్నేహితుడు 'గాంధీ'రావు తన కొట్టులోకి తీసుకువెళ్లేడు.

జీవితంలో ఎన్నిదెబ్బలు తిన్నా, ఎన్నికష్టాలొచ్చినా భయపడకండా ఎల్లాగోఅల్లా బతికే అశావా దతను! అతనిలోని ఆ గొప్పతనమే నన్ను ఆకర్షించేది.

లోపల కొత్తరకం కుర్చీలున్నాయి.

"చాలా బాగున్నాయ్! ఎక్కడివీ?" అన్నాను.

"మనరామంగాడి 'పటేల్' ఫర్నిషింగ్ హౌస్‌లేదూ. అక్కడ తీసుకున్నాను."

"మరి పాతవి?"

"అవి మేం కొత్తగా తెరుస్తున్న 'రాజేంద్ర ప్రసాద్' రెడీమేడ్ డ్రెస్‌పేలెస్‌కి యిచ్చాను."

ఇంకో అరగంట అక్కడ కాలక్షేపమయింది. దారిలో ఎవడో కుర్రాడు, యింటికి తిరిగి వొస్తుంటే అడ్డుపడి 'కాళేశ్వర్రావు' మార్కెట్‌లో తన పర్సు పోయిందనీ, తన సవితితల్లి 'స్వరాజ్య' లక్ష్మి తిడుతుందనీ వెనకాలపడ్డాడు. ఓ పావలా యిచ్చి వాణ్ణి వొదిలించుకున్నాను.

చివరికి 'పత్రి'కకి రాద్దామనుకుని టేబిల్ ముందు కూచున్నాను. 'అజాద్' కలం తీసి విదిపితే సిరాలేదు. 'సుభాస్' సిరాకంపెనీ వాళ్ల సిరా తీసి పోశాను. తెల్లకాగితా లైపోతే 'ఆంధ్రా' పేపరుమిల్సువారి 'బ్రౌను' కాగితాలు తీశాను.

అంతసేపు ఏదో రాద్దామనే తీవ్రమైన కోరిక వుందన్న మాటేగాని ఏం రాయాలో ఆలోచించుకోలేదు.

సాధారణంగా ఫలానాది రాయాలని తీవ్రమైన వాంఛ వుంటేగాని కలం పట్టను. కలం పట్టాక ఆలోచించడంనాకు చేతకానిపనుల్లో ఒకటి.

ఈవేళిది కొత్తవటంవల్ల ఆలోచించసాగాను, ఏం రాద్దామని. అసలు రాయవల్సింది తప్ప తక్కిన ఆలోచనలన్నీ తోస్తున్నాయి.

ఒకపత్రికవాళ్లు కొత్తరోజుల్లో 'కమ్యూనిస్టు తెలుగు దినపత్రిక' అని ప్రకటించి, తర్వాత 'తెలుగు' అనడము మానేశారు. అలాగే ఆలిండియా రేడియోవారు 'ఆలిండియా రేడియో-తెలుగులోవార్తలు' అని వార్తా ప్రసరణం కావించేవారు- ఇప్పుడు "వార్తలు" అని మాత్రమే అంటున్నారు.

ఈరోజుల్లో అన్నీ రాజకీయ పదాలు తగిలించడం పాషన్‌కదూ-అందుకనే, 'జైహింద్' 'వందేమాతరం' అనే పేర్లతో పత్రికలొస్తున్నాయి.

అసలు దీని పునాది వేరేవుంది. అది ఫిలిం ప్రపంచంలో పుట్టిన వెర్రితలలతో మొదలైంది. ఎందుకంటే 'కన్నన్' టీ అండ్ కాఫీ, 'కృష్ణవేణి'సిరా, 'కాంచన్' స్నో, 'మాలపిల్ల' చీర, 'రైతుబిడ్డ' రవికలగుడ్డ అని మొదలైంది వర్తకం - కాని - సినిమారంగంనించి ఈ

జబ్బు (చివరికి ఇదొక జబ్బేమోననే అనుమానం కలిగింది - ఆలోచించగా) రాజకీయరంగంలోకి వొచ్చి, ప్రతి కాఫీహోటలు పేరు మొదటా, ప్రతి సిగరెట్టు, బీడీలమీదా, ప్రతి క్షౌరశాలమీదా దేశనాయకులే, గౌరవమైన జాతీయపదాలే సాక్షాత్కరించడం జరిగింది.

ఏమిటి ఈ షాహుకార్ల ఉద్దేశం? ప్రజల కళ్లల్లో దుమ్ముకొట్టాలనా? దేశనాయకుల పేర్లమీది గౌరవంతో వాళ్ళ అసలువిలువ గ్రహించలేని మూర్ఖులు, ఈ ప్రజలంతా అనా? ఎన్నాళ్లు ఈ దారుణం?

కొన్ని ఇన్స్టిట్యూషన్స్‌కి నాయకుల పేర్లు పెడితే, జాతీయపత్రికలకి జాతీయోద్రేకాన్నిచ్చే పేర్లు పెడితే కొంత అర్థముంది.

"కనకశెట్టి గాంధీజీ మరణించిన రెండురోజులకే 'మహాత్మాజీకేఫ్' హోటలు పెద్ద ప్రచారంతో తెరిచాడు. గాంధీమీది భక్తికొలదీ ప్రజలు... ... ... చివరికి ప్రజలు ఆ పేరువల్ల మోసగించబడడం గుర్తించి, శెట్టిచే బలవంతంగా పేరుమార్పించి, గాంధీజీగౌరవం నిలిపారు.

'పత్రిక' కోసం రాయసాగాను!

*22.10.1948–తెలుగు స్వతంత్ర వారపత్రిక*